నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
3 | నిజామాబాద్, గురువారం 15 ఫిబ్రవరి 2024 | NIZAMABAD

# ఉమ్మడి జిల్లాలో నలుగురు డీఎస్పీల బదిలీ

## ఉత్తర్వులు జారీచేసిన డీజీపీ రవిగుప్తా



వినాయక్‌నగర్/ కామారెడ్డి, ఫిబ్రవరి 14: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నలుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవి గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పనిచేస్తున్న కె.రాజశేఖర్ రాజును మిర్యాలగూడ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆర్మూర్ ఏసీపీ జె.జగదీశ్ చందర్‌ను డీసీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ఖమ్మం రూరల్ డీఎస్పీగా ఉన్న బి.బస్వారెడ్డిని నియమించారు. బోధన్ ఏసీపీ కె.ఎం. కిరణ్‌కుమార్‌ను డీసీపీ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని ఆర్డర్స్ జారీ చేశారు. ఆయన స్థానంలో పీసీఎస్ ఐటీసెల్‌లో విధులు నిర్వర్తిస్తున్న పి.శ్రీనివాస్‌కు పోస్టింగ్ ఇచ్చారు. కామారెడ్డి డీఎస్పీ ఆర్.ప్రకాశ్‌ను మంచిర్యాల జిల్లా రామగుండం ఏసీపీగా బదిలీచేయగా ఆయన స్థానంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో పనిచేస్తున్న డాక్టర్ డి.రాజేశ్వర్‌ను నియమించారు. అధికారులు వెంటనే వారికి కేటాయించిన చోట్ల రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

## ఘనంగా వసంత పంచమి

వసంత పంచమి వేడుకలను బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టినరోజును పురస్కరించుకొని భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు.

# పన్నుల వసూలులో దూకుడు

**గ్రామ పంచాయతీల్లో** *వివిధ రకాల పన్నుల వసూళ్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 46 రోజులు గడువు మాత్రమే ఉండడంతో వందశాతం లక్ష్యం సాధించేందుకు సిబ్బంది కృషిచేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి గ్రామ కార్యదర్శులు పన్నులు వసూలు చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి పన్ను చెల్లింపులు ఎంత కీలకమో అవగాహన కల్పిస్తుండడంతో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 76.96శాతం వసూలు చేశారు.*

*– నందిపేట్, ఫిబ్రవరి 14*

నిజామాబాద్ జిల్లా పంచాయతీ విభాగం పన్నుల వసూళ్లలో దూకుడు ప్రదర్శిస్తున్నది. 2023– 24 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేందుకు మరో 46 రోజులు మిగిలి ఉండగానే దాదాపు 76.96 శాతం పన్నుల వసూళ్లు జరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి లక్ష్యానికి చేరువవుతామన్న ధీమాతో పంచాయతీ విభాగం అధికారులు ఉన్నారు. మొన్నటి వరకు ఎన్నికలతోపాటు పథకాల దరఖాస్తుల స్వీకరణ తదితర పనుల్లో బిజీగా ఉన్న సిబ్బంది.. ఇప్పుడు పన్నుల వసూళ్లకు ప్రాధాన్యమివ్వడంతో పురోగతి వచ్చింది. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ, పన్నుల వసూళ్లపై లక్ష్య నిర్దేశం, నిరంతర సమీక్షలు, పంచాయతీలకు అందుబాటులో కార్యదర్శులు.. తదితర సానుకూల అంశాలు పన్నుల వసూళ్లలో త్వరితగతిన పురోగతి సాధించేందుకు దోహదం చేస్తున్నాయి. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఆయా శాఖలు, విభాగాలకు సంబంధించి పర్యవేక్షణ, పనిఒత్తిడి ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శులు వాటిని అధిగమించి పన్నుల వసూళ్లలో పురోగతి సాధించారు.


- ముమ్మరంగా ఇంటి పన్ను వసూలు
- లక్ష్యం దిశగా అడుగులు
- ఇప్పటికే 76.96 శాతం వసూళ్లు
- స్పెషల్ డ్రైవ్‌తో సత్ఫలితాలు





### స్పెషల్ డ్రైవ్‌తో సత్ఫలితాలు

పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు బృందాలుగా ఏర్పడి స్పెషల్ డ్రైవ్‌లతో ఇంటింటికీ తిరిగి వసూళ్లు నిర్వహించడంతో మొండి బకాయిలు సైతం వసూళ్లవుతున్నాయి. దాదాపు మండలాలన్నీ కొద్దిపాటి దూరంలోనే ముందు, వెనుకలో ఉన్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు సత్ఫలితాలు వస్తున్నాయి. గతంలో పన్ను వసూలు కాక పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో నిధులు లేక సిబ్బంది వేతనాలకు, కనీస సౌకర్యాల కల్పనకు ఇబ్బందులు ఎదురయ్యేది. పంట డబ్బులు చేతికివచ్చిన సమయంలో పక్కా ప్రణాళికతో ప్రక్రియ చేపట్టడంతో వసూళ్లు జరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో కనీస అవసరాలైన తాగునీటి సరఫరాకు మరమ్మతులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, పంచాయతీ ట్రాక్టర్ నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, సిబ్బంది వేతనాలతోపాటు ఇతరాత్ర అవసరాలకు ఉపయోగపడుతున్నాయి.



నందిపేట్ మండలంలో స్పెషల్‌డ్రైవ్ ద్వారా పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది (ఫైల్‌ఫొటో)

### వెనుకబడ్డ మండలాలపై ప్రత్యేక దృష్టి

పన్నుల వసూలులో వెనుకబడ్డ మండలాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లక్ష్య సాధనకు కృషి చేయాలని అధికారులు, సిబ్బందికి సూచిస్తున్నారు. వెనుకబడ్డ గ్రామాలను గుర్తించి గ్రామాల వారీగా పురోగతి తెలుసుకొని, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు లక్ష్యాన్ని సాధించేలా పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అవసరమైతే జిల్లాస్థాయి అధికారులు సైతం గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ పన్ను చెల్లిస్తే కలిగే లాభాలను ప్రజలకు వివరిస్తున్నారు.

### ముందంజలో వేల్పూర్, నిజామాబాద్ రూరల్..

జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉండగా 2,75,000 నివాసాలు ఉన్నాయి. మండలాల వారీగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (పన్నుల డిమాండ్) ఆధారంగా లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. జిల్లా మొత్తంలో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 26,80,09,190 వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు రూ. 20,62,47,707 వసూలు చేయగా, ఇంకా రూ. 6,17,61,483 వసూలు చేయాల్సి ఉన్నది. వేల్పూర్ 80.58 శాతం, నిజామాబాద్ రూరల్ 80.03 శాతంతో ఈ రెండు మండలాలు జిల్లాలో ముందు వరుసలో ఉండగా, ఎడపల్లి 75.06 శాతం, మోస్రా 75.07 శాతంతో వెనుకంజలో ఉన్నాయి.

## సెల్‌ఫోన్ల రికవరీలో కామారెడ్డి మొదటి స్థానం

కామారెడ్డి, ఫిబ్రవరి 14: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నదని ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 1053 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి సబ్ డివిజన్ పరిధిలో 398, బాన్సువాడ డివిజన్‌లో 442, ఎల్లారెడ్డి పరిధిలో 213 ఫోన్లు సీఈఐఆర్ ద్వారా గుర్తించామని వివరించారు. బాన్సువాడ, కామారెడ్డి ఠాణాలు మొదటి రెండు స్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోయిన వారు వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మొబైల్ ఫోన్ల రికవరీకి కృషిచేసిన సిబ్బందిని అభినందించారు

## బ్రెయిన్ డెడ్ అయిన కానిస్టేబుల్ అవయవాలు దానం

### మూడు రోజులుగా కోమాలో ఉన్న కార్తీక్ మృతి

### కుక్కను తప్పించబోయి ప్రమాదం



బెజ్జంకి కార్తీక్ (ఫైల్)

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 14: బ్రెయిన్ డెడ్‌తో మూడు రోజులుగా కోమాలో ఉన్న ఓ కానిస్టేబుల్ బుధవారం మృతిచెందాడు. ఆయన అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బెజ్జంకి కార్తీక్ (33) ఆదివారం డ్యూటీ ముగించుకొని బైక్‌పై కామారెడ్డికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దేవునిపల్లిలోని ఆర్యక్షత్రియ భవనం వద్ద కుక్కఅడ్డు రావడంతో తప్పించబోయి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో కార్తీక్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ముందుగా ఆయనను స్థానిక ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. మూడు రోజులపాటు కోమాలో ఉన్న ఆయన బుధవారం మృతి చెందాడు. కార్తీక్ అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారని ఎస్సై తెలిపారు.

## ఘన నివాళి

పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీరజవాన్లకు ఉమ్మడి జిల్లా ప్రజలు బుధవారం ఘననివాళులర్పించారు. విద్యాసంస్థలు, గ్రామీణ, పట్టణ ప్రధాన కూడళ్ల వద్ద జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జవాన్ల త్యాగానికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని వక్తలు పేర్కొన్నారు.



పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న యువకులు

## జలధార..

### మిషన్ కాకతీయ ఫలం..

మిషన్ కాకతీయ ఫలాలు సాక్షాత్కరిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పథకంతో చెరువులన్నీ నిండుకుండలా మారాయి. దీంతో భూగర్భ జలమట్టం పెరిగింది. ఇందుకు నిదర్శనమే నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం చింతకుంట గ్రామంలో వరి సాగు చేస్తున్న పొలాల్లో పక్కపక్కనే నాలుగు బోర్లు నిరంతరం నీళ్లు పోస్తున్నాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



# జాగో బంజారా.. మారో నంగరా

- గోరూర్ భగవాన్.. సేవాబాయా
- గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్
- నేడు 285వ జయంతి
- గిరిజనులకు ప్రత్యేక సెలవు ప్రకటించిన ప్రభుత్వం
- తండాల్లో పండుగ వాతావరణం

*బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్. నాగరిక సమాజానికి దూరంగా ఉంటూ అటవీ ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజనులకు దిశానిర్దేశం చేసిన మహనీయుడు. బంజారాల ఆలోచన, వారి జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చిన మహానుభావుడు సేవాలాల్ మహరాజ్. సాంఘిక సమానత్వం కావాలంటూ, బంజారాలు ఆర్థికంగా బలపడాలంటూ పలు బోధనలు చేశారు. నేడు (గురువారం) సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.*

*– బోధన్ రూరల్/ ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 14*





సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ప్రస్తానం.. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లాలోని గడ్డమాంగలూరు గ్రామానికి చెందిన రామావత్ భీమానాయక్, ధర్మిణి దంపతులు. మొదటి బిడ్డగా సంత్ సేవాలాల్ మహరాజ్ 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా గుత్తి బళ్లారిలోని గుత్తి రాంజీనాయక్ తండాలో జన్మించాడు. సేవాలాల్ చిన్నతనం నుంచి భక్తి భవాలు కలిగిన మహనీయుడు. గిరిజనులను ఏకం చేసేందుకు, జాతి సన్మార్గంలో పయనించేలా సేవాలాల్ మహరాజ్ దేశమంతా తిరిగి ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ మహిమలను నవాబ్ ఉస్మాన్ పాషా నమ్మి హైదరాబాద్ శివారులోని కొంత ప్రాంతాన్ని ఇచ్చాడని, అదే నేటి బంజారా హిల్స్, జూబ్లీహిల్స్ అని పలువురు చెబుతున్నారు. అలా బోధనలు చేస్తూ సేవాలాల్ మహరాజ్ మహారాష్ట్రలోని రాయగాడ్ జిల్లాలో సమాధి అయ్యారు. సేవాలాల్ మహరాజ్ సమాధి అయిన రాయగాడ్ బంజారాల పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్నది. ఈ ప్రాంతాన్ని పౌరఘడ్, సేవాఘడ్‌గా పిలుస్తారు. ప్రస్తుతం ప్రతి తండాలో తప్పనిసరిగా సేవాలాల్ మహరాజ్ మందిరాన్ని నిర్మించుకొని ఆ మహనీయుడు చూపిన మార్గంలో గిరిజనులు పయనిస్తున్నారు.

### నియమ నిష్టలతో పూజలు ..

ఉమ్మడి జిల్లాలో సుమారు 375వరకు తండాలు ఉన్నాయి. 3లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరంతా సేవాలాల్ మహరాజ్‌ను పూజిస్తారు. పండుగ రోజున జెండాలను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భోగ్‌భండార్ (సిరా అన్నదానం) చేస్తారు. సేవాలాల్ మహరాజ్ జయంతి రోజు తండాలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. సేవాలాల్ మహరాజ్‌ను స్మరించుకొని మాలధారణ చేస్తారు. బంజారాలను ఐకమత్యం చేసేందుకు, వ్యసనాలకు దూరంగా ఉండేందుకు కులపెద్దలు మాలధారణను ప్రోత్సహిస్తున్నారు. ఆలయాల వద్ద ఉంటూ దీక్షలను నియమ నిష్ఠలతో కొనసాగిస్తున్నారు.ఈ మాలధారణ శివరాత్రికి ప్రారంభమై శ్రీరామనవమికి పూర్తవుతుంది.

### ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించిన ప్రభుత్వం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. మాజీ సీఎం కేసీఆర్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం ప్రారంభించారు. సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక సాధారణ సెలవుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నేడు జరిగే 285వ జయంతి కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లారెడ్డి నియోజకవర్గానికి రూ.లక్షా 80వేలు మంజూరు చేసింది.

### సెలవుదినంగా ప్రకటించాలి



సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని సాధారణ సెలవుదినంగా కాకుండా పూర్తిగా సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించాలి. రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశాల్లో సేవాలాల్ మహరాజ్ చరిత్రను చేర్చాలి. ఆలయాల నిర్మాణానికి నిధులను కేటాయించాలి. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలి. పూజారులకు గౌరవభృతి అందించాలి.

**– గణేశ్ ,మాజీ సర్పంచ్, వీరన్నగుట్టతండా, బంజారా సంఘం నాయకులు**

### ఆదర్శంగా తీసుకోవాలి



గిరిజన జాతికి సంత్ సేవాలాల్ మహరాజ్ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. జయంతి రోజున ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి. సమైక్య రాష్ట్రంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బంజారాల మనోభావాలను గుర్తించి అధికారికంగా నిర్వహించడం సంతోషకరం.

**– డాక్టర్ రాంసింగ్ నాయక్ – మెడికల్ కళాశాల ప్రొఫెసర్, కామారెడ్డి**